నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, శనివారం 24 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

వైభవంగా తెప్పోత్సవం

- లక్ష్మీచెన్నకేశవుడి విహారం

గద్వాల టౌన్, ఫిబ్రవరి 23 : గద్వాల సంస్థానంలో కొలువుదీరిన శ్రీ భూలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సంస్థానాధీశుల కాలంనాటి లింగంబావిలో స్వామివారి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష ఫల పంచామృతాభిషేకం చేసి సాయంత్రం ఆలయం నుంచి లింగంబావి వరకు ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. అనంతరం లింగంబావిలోని ఆలయం వద్ద శ్రీ భూదేవి, లక్ష్మీదేవిలతోపాటు చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సతీమణిబండ్ల జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సంస్థానాధీశుల కాలంనాటి లింగంబావిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు.


లక్ష్మీచెన్నకేశవస్వామి తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


క్రీడాకారుడినిస న్మానిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

జాతీయస్థాయి పోటీల్లో రాణించాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఫిబ్రవరి 23 : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమని, క్రికెట్‌లో రాణించి జిల్లా పేరును జాతీయస్థాయిలో నిలబెట్టాలని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. గద్వాలకు చెందిన అరుణ్‌కుమార్ హెచ్‌సీఏ జాతీయస్థాయి అండర్-23 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అరుణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల క్రీడలకు పుట్టినిల్లని ఇప్పటికే కబడ్డీ, ఫుట్‌బాల్, కరాటే తదితర క్రీడల్లో జాతీయస్థాయిలో రాణిస్తూ జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొవచ్చారని చెప్పారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, దొలన్న, లక్ష్మన్న, నర్సింహులు, హన్మంత్‌రెడ్డి, రమేశ్, ధర్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందితకు నివాళి

శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మృతి పై ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో లాస్యనందిత పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ఎంజీకేఎల్ఐ లిఫ్ట్-3 గుడిపల్లి రిజర్వాయర్ 2023 మార్చి 1న జలకళతో దర్శనమిచ్చింది. కాల్వలు పారడంతో యాసంగిలో సిరుల పంటలు పండాయి.

జలసిరులు

2023 డిసెంబర్‌లోనే గుడిపల్లి లిఫ్ట్‌నకు నీటి విడుదల నిలిచింది. దీంతో రిజర్వాయర్ ఒట్టిబోయింది. బండరాళ్లు తేలగా.. నీళ్లు పారక కాల్వలు వెలవెలబోయాయి.

కరువు ఛాయలు

నాడు గలగల నేడు వెలవెల

- నీళ్లులేక బోసిపోయిన గుడిపల్లి రిజర్వాయర్
- వేసవికి ముందే ఒట్టిబోయి..
- ఆయకట్టు కింద పూర్తిగా తగ్గిన సాగు విస్తీర్ణం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో లక్ష ఎకరాలు తగ్గిన యాసంగి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : గుడిపల్లి రిజర్వాయర్ గతేడాది ఇదే సమయంలో నిండుకుండలా కృష్ణమ్మ పరుగులు తీయగా.. నేడు నీళ్లు అడుగంటి వట్టిపోయింది. వేసవి రాకముందే నీళ్లు అడుగుల్లోతుకు చేరాయి. నాడు రిజర్వాయర్‌లోని కాల్వల గుండా మార్చి వరకు నిండుగా ప్రవహించిన నీళ్లు ప్రస్తుతం రాళ్లు తేలి కాల్వలు వెలవెలబోతున్నాయి. దీంతో రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా మూడోదైన గుడిపల్లి రిజర్వాయర్ సామర్థ్యం 0.96టీఎంసీ మాత్రమే. అయితే ప్రాజెక్టు నీళ్లను నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తికి తరలించడంలో ఈ రిజర్వాయరే కీలకం. కొల్లాపూర్ మండలంలోని ఎల్లూరు(0.35టీఎంసీలు), సింగోటం శ్రీవారి సముద్రం(0.55టీఎంసీలు), జొన్నలబొగుడ (2.14టీఎంసీలు)రిజర్వాయర్ల నుంచి నీళ్లు పొలాలకు మళ్లుతాయి. ఇలా ఎంజీకేఎల్ఐలో అత్యంత కీలకమైన గుడిపల్లి రిజర్వాయర్ ప్రస్తుతం చిన్న చెరువులా మారిపోయింది. గత వానకాలంలో వర్షాలు కురియక కృష్ణానదికి వరదలు రాలేదు. దీంతో శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి మట్టాలు డెడ్ స్టోరేజీకి చేరాయి. ఈ కారణంగా ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి దాదాపుగా మార్చి వరకు గుడిపల్లి రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల కొనసాగింది. ఎండాకాలంలోనూ చెరువుల్లో నీళ్లు మత్తడి దూకాయి. కానీ ఈ సారి గత డిసెంబర్ వరకు మాత్రమే ఈ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత నీటి విడుదల నిలిచిపోయింది. అప్పటికే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంతో రైతులు సాగును తగ్గించుకున్నారు. జిల్లాలో గత సీజన్‌లో జిల్లాలో 3,12,096 ఎకరాల విస్తీర్ణంలో పంటల వేయగా, ఈ సారి 3,15,919 ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 2,20,959ఎకరాల్లో మాత్రమే పంటల సాగు చేపట్టడం గమనార్హం. దీంతో లక్ష ఎకరాల విస్తీర్ణం తగ్గింది. జిల్లాలో భూగర్భ జలమట్టాలు పడిపోయాయి. గతేడాది జనవరిలో దాదాపుగా 5.07మీటర్లలో భూగర్భ జలమట్టముండగా, ఈ ఏడాది జనవరిలో 8.64మీటర్లకు పడిపోయింది. దీనివల్ల రైతులు బోర్ల కింద సాగు చేపడుతున్నారు. చిన్న చెరువుల్లో నీటి శాతం బాగా తగ్గిపోయింది. ఎంజీకేఎల్ఐ ద్వారా 2017నుంచి ఇప్పటి వరకు దాదాపుగా 550టీఎంసీల నీటిని జిల్లాకు ఎత్తిపోయడం జరిగింది. ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాలో ప్రతి ఏడాది వానకాలం, యాసంగిలో దాదాపుగా 9లక్షల ఎకరాల్లో పంటల సాగు చేపడుతున్నారు. ఈసారి ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు తగ్గడంతో రైతన్నల్లో నిరాశ, నిస్పృహలు కనిపిస్తున్నాయి.

గతేడాది జనవరిలో నిండుగా పారుతున్న అచ్చంపేట బ్రాంచ్ కెనాల్



ఈ ఏడాది జనవరిలో ప్రవాహం లేక బోసిపోయిన అచ్చంపేట బ్రాంచ్ కెనాల్

మన్యంకొండను అద్భుతంగా తీర్చిదిద్దాం

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, ఫిబ్రవరి 23 : పేదల తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ ఆలయాన్ని కేసీఆర్ సర్కారు హయాంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, మరిన్ని వసతుల కోసం గతంలోనే ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీవెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారిని శ్రీనివాస్‌గౌడ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బస చేసేందుకు రూ.2కోట్ల 50లక్షలతో 18 ప్రత్యేక గదలను నిర్మించినట్లు తెలిపారు. తాగునీరు, కొండపైకి వెళ్లేందుకు నాలుగు లేన్ల రహదారితోపాటు సెంట్రల్ లైటింగ్, రూ.15కోట్లతో హోటల్, పేదింటి ఆడపిల్లలకు పెండ్లి చేసేందుకు రూ.50లక్షలతో హాల్ నిర్మాణం చేపట్టామన్నారు. అలాగే రూ.2కోట్లతో అత్యాధునిక వసతులతో కల్యాణ మండపం కోసం గత ప్రభుత్వంలోనే పనులు ప్రారంభించామని, తెలంగాణలోనే మొట్టమొదటి రోప్‌వే కోసం తన హయాంలో శంకుస్థాపన చేసినట్లు వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం భక్తులకు ఇబ్బందులు లేకుండా పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, మన్యంకొండ ఆలయ చైర్మన్ మధుసూదన్‌కుమార్, సీనియర్ నాయకులు రాజేశ్వర్, దేవేందర్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, వెంకట్‌స్వామి, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఎమ్మెల్యే లాస్యనందిత మృతి బాధాకరం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 23 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతిచెందడం బాధాకరమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో లాస్యనందిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లాస్యనందిత చిన్న వయసులోనే చనిపోవడం దురదృష్టకరమన్నారు. ఎంతో రాజకీయ భవిష్యత్ ఉన్న ఆమె ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. ఏడాది కిందట ఆమె తండ్రి చనిపోవడంతో బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి ఆమెకు కేసీఆర్ ఎమ్మెల్యే సీటు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.


ఎమ్మెల్యే లాస్యనందిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి

ఆటో యూనియన్ అధ్యక్షుడికి పరామర్శ..

ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు గంధం రాజు అనారోగ్యంతో ఇటీవల గుండె ఆపరేషన్ చే యించుకొని జిల్లా కేంద్రంలోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి స్వయంగా ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్నయాదవ్, కంచెరవి, ఎండీ గౌస్, జత్రూనాయక్, గులాం ఖాదర్, రహీమ్, జొహెబో, ప్రేమ్, వహీద్ పాషా, తిరుపతయ్య, వెంకటయ్య, పరంజ్యోతి, విజయ్, డానియేల్, రాంచందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

నీటిగుంతలోపడి బాలుడు మృతి

- బొందలపల్లిలో ఘటన

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 23 : నీటిగుంతలో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని బొందలపల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బొందలపల్లికి చెందిన ప్రవీణ్‌గౌడ్ (12) గురువారం రాత్రి గ్రామ శివారులో ఉన్న నీటి గుంతలో పడిమృతి చెందాడు. శుక్రవారం గమనించిన గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ప్రమాదశాత్తు నీటి గుంతలోపడి మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతాం

- కాంగ్రెస్ హామీలు అమలయ్యే వరకు వదిలేది లేదు
- ప్రజాస్వామ్యమంటే దౌర్జన్యాలు, బెదిరింపులేనా?
- రేపు అచ్చంపేటకు గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేట, ఫిబ్రవరి 23 : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టమని, వందరోజుల పాలన పూర్తయిన తరువాత ప్రజా సమస్యలపై పోరాడుతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. శుక్రవారం అచ్చంపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గువ్వల మాట్లాడారు. ఈనెల 25న అచ్చంపేటలోని కొండనాగుల రోడ్డులో గల బీకే ప్యాలెస్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే కార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 8 మండలాలు, అచ్చంపేట మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ముఖ్యనేతలు తరలిరావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చారని, వందరోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామన్నారు. దుందుభీవాగులో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, అధికారం ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై దౌర్జన్యాలు, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, ఉడుత బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వ్యక్తిగత విమర్శలు మాని పరిపాలనపై దృష్టిసారించాలన్నారు. అబద్ధాన్ని పదేపదే చెప్పినంత మాత్రాన ప్రజలెవరూ నమ్మరన్నారు. రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులు పూర్తిస్థాయిలో ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదన్నారు. అలాగే తాగునీరు, కరెంటు కోతలతో ప్రజలు సతమతమవుతుండగా, పంటలు ఎండి రైతులు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ఆవేదన చెందుతున్నారని వెల్లడించారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామా అని ప్రజలు ఆలోచనలో పడ్డారన్నారు. ఆరు గ్యారెంటీలు కాదు 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 25న నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు రమేశ్ రావు, మన్నుపటేల్, సోమ్లానాయక్, గడ్డం రమేశ్, సింగిల్‌విండో చైర్మన్ నర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ రాంబాబు, మాజీ సర్పంచ్ లోక్యానాయక్, మైనారిటీ నాయకులు అమీనొద్దీన్, కుత్బుద్దీన్, సుంకరి బాలరాజు, గోపాల్‌నాయక్, చెన్నకేశవులు, చుక్కారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మోతీలాల్, శ్రీను, పర్వతాలు, ఉస్సేన్, పెంటయ్య, లింగం, తిరుపతయ్య, వెంకటయ్య, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


అచ్చంపేట విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నబీఆ ర్ఎస్‌జి ల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

పిల్లలూ జాగ్రత్త!

- వేగంగాగవద బిళ్లల కేసులు
- 15 ఏండ్లలోపు చిన్నారులపై ప్రభావం
- రెండు నుంచి నాలుగు వారాలపాటు లక్షణాలు
- సూచనలు పాటిస్తే మేలు

మద్దూర్ (కొత్తపల్లి), ఫిబ్రవరి 23 : చాలాకాలం తర్వాత గవదబిళ్లల కేసులు విజృంభిస్తున్నాయి. జిల్లాలో కొద్ది రోజులుగా ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. చిన్నారులకు ఈ వ్యాధి సోకుతుండంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలో గవదబిళ్లలు అంటే ఏమిటి? వాటి లక్షణాలు ఎలా ఉంటాయోఇ ప్పుడుతెలు సుకుందాం.

గవదబిళ్లలు అంటే..

ఇది మిక్సోవైరస్ పరోటిడిస్ అనే వైరస్ వల్ల వ్యాపిస్తుంది. వీటిని 'చెంపగడ్డలు' అని కూడా పిలుస్తారు. సాధారణంగా 5-15 ఏండ్ల వయస్సు గల పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. చెవి ముందు, కింది దవడ భాగం వరకు విస్తరించి ఉన్న పరోటిడ్ లాలాజల గ్రంథి వాచి నొప్పిగా అనిపిస్తుంది. దీనివల్ల జ్వరం, తలనొప్పి, చెవి నొప్పి మొదలవుతాయి. నోరు పూర్తిగా తెరిచి ఆహారం మింగడం కూడా కష్టమవుతుంది.

వ్యాప్తి ఇలా..

గవద బిళ్లలను మెడికల్ టెర్మినాలజీలో మామ్స్ అంటారు. మన నోట్లో పరోటిడ్ గ్రంథి వాయడం వల్ల గవదబిళ్లలు వస్తాయి. ఇది సాధారణంగా 15 ఏండ్ల లోపు వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధిగ్రస్తులు దగ్గినా, తుమ్మినా, మాట్లాడినప్పుడు, వాంతులు అయినప్పుడు ఒకరి నుంచి ఇంకొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ సోకిన వ్యక్తిలో రెండు నుంచి నాలుగు వారాలపాటు ఈ లక్షణాలు కనిపిస్తాయి. గవద వద్ద వాపు వచ్చే భాగంలో లాలాజలాన్ని తయారు చేసే గ్రంథులుంటాయి. దవడ ఎముక కింద ఒక జత, చెవుల సమీపంలో మరో జత, నాలుక కింది భాగంలో మరో జత ఇలా మొత్తం మూడు జతల లాలాజల గ్రంథులు ఉంటాయి. వీటిని సెల్యులరీ గ్లాండ్స్ అంటారు. చెవుల కింద ఉండే మూడు జతల గ్రంథులను పరోటిడ్ గ్రంథులు అంటారు. ఈ గ్రంథులకు వైరస్ సోకినప్పుడు గవదబిళ్లలు వస్తాయి.

వ్యాధిల క్షణాలు

స్వల్పంగా జ్వరం, కొందరిలో తీవ్ర జ్వరం వస్తుంది. చెవి వెనుకభాగంలో, దవడల మూలాల చెవుల కింది భాగంలో వాపు వస్తుంది. ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కీళ్లనొప్పులు, గొంతు నొప్పితోపాటు జలుబు, దగ్గు, చలి పెట్టడం, ఆహారం నమిలేటప్పుడు చెవి వద్ద నొప్పి వస్తుంది. ఈ వైరస్ సోకడం వల్ల రెండునుంచి నాలుగు వారాల పాటు ఇబ్బందిగా ఉంటుంది. ఇన్ఫెక్షన్ కారణంగా కొందరిలో మామ్స్ ఎన్ సెఫలైటిస్ వచ్చే ప్రమాదం ఉంటుంది. జ్వరం, దవడ నొప్పి ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

వ్యాధిని యంత్రణ..

వ్యాధి సోకిన వారు వారం పాటు ఐసోలేషన్‌లో ఉంటూ పోషకాహారం తీసుకోవాలి. మెత్తని ఆహారం, లిక్విడ్స్ ఎక్కువగా తీసుకుంటే రెండు వారాల్లో ఇన్ఫెక్షన్ తగ్గుతుంది. అలాగే మాస్క్ ధరించడం మంచిది. వ్యాధి తీవ్రతను బట్టి విశ్రాంతి అవసరం. వైద్యుల సూచన మేరకు జ్వరం, నొప్పులకు సంబంధించిన మందులు వాడాలి. ఇక పిల్లలకు ఎంఎంఆర్ (మీజిల్స్ మామ్స్, రుబెల్లా) టీకాలను ఇప్పించడం ద్వారా కొంతమేరకు గవదబిళ్లలను నియంత్రించవచ్చు. ఈ వ్యాక్సిన్‌ను రెండు డోసుల్లో ఇస్తారు. తొలిడోసు 9 నుంచి 12 నెలల మధ్య, రెండోది 12 నుంచి 15 నెలల మధ్య ఇస్తారు. డాక్టర్ల సూచనలు పాటించాలి.

ఉపాధ్యాయులపై

కోతుల దాడి

అచ్చంపేట, ఫిబ్రవరి 23 : పాఠశాలకు వెళ్తున్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులపై కోతులు దాడి చేయడంతో ఇద్దరికీ గాయాలైన ఘటన అచ్చంపేట మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. పదర మండల కేంద్రానికి చెందిన బూరం ఆంజనేయులు వెల్దండ మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అమ్రాబాద్ మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి వెంకటేశ్ వంగూరు మండలంలోని ఉల్పర పాఠశాలలో పనిచేస్తున్నాడు. ఇద్దరూ ఒకే ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అచ్చంపేట మండలం రంగాపూర్ అటవీ శాఖ నర్సరీ వద్ద ఒక్కసారిగా కోతుల గుంపు ద్విచక్రవాహనంపైకి దూసుకొచ్చింది. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు స్వల్ప గాయాలు కాగా, ఆంజనేయులు తలకు బలమైన గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించిన 108లో క్షతగాత్రులను అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై ఆగ్రహం

- మొల్గరలో వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

ఉప్పునుంతల, ఫిబ్రవరి 23 : విచ్చలవిడిగా నిర్వహిస్తున్న ఇసుక అక్రమ రవాణాపై శుక్రవారం మండలంలోని మొల్గర గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని మొల్గర సమీపాన ఉన్న దుందుభీలో వారం రోజులుగా కాంగ్రెస్ నాయకులు జేసీబీలతో ఇసుకను తవ్వి టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా రవాణా చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం ఇసుక రవాణా చేస్తు న్న ట్రాక్టర్లు, టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం పేరిట ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. దుందుభీ వాగు పూర్తిగా ఎడారిగా మారి భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. రానున్న రోజుల్లో నీటి సమస్య జఠిలమవుతుందన్నారు. అధికారులు పట్టించుకోకపోతే మార్చి 1న తాసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మొల్గర వద్ద ఇసుక రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు